విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 19, సెప్టెంబర్ 2025

## ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలి

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల:** అర్హులైన ప్రతి ఒక్క ఆటో డ్రైవర్‌కు వాహన మిత్ర పథకాన్ని అమలు చేయాలని నంద్యాల జిల్లా ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.శివ బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆటో కార్మికుల మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వాహన మిత్ర ఆన్లైన్ దరఖాస్తు గడువు నెల రోజులకు పొడిగించాలన్నారు. మృతి చెందిన ఆటో కార్మికులకు ప్రమాద బీమా ఇవ్వాలన్నారు. ఆటో కార్మికుల విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనుసరిస్తుందని విమర్శించారు. ఏఐటీయుసీ కార్యదర్శి కుళాయి స్వామి అధ్యక్షులు చంటి మహేష్ మాట్లాడుతూ శ్రీశక్తి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో కార్మికులకు సర్వే చేసి అర్హులైన ప్రతి కార్మికునికి ప్రతినెల రూ.5 వేలు ఇచ్చి కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. వాహన మిత్ర పథకం అమలు ఎలాంటి ఆంక్షలు పెట్టకూడదన్నారు.

## మాజీ ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల:** నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి జన్మదినం పురస్కరించు కొని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డా.దాల్మిల్ అమీర్ బాష ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే గృహం వద్ద వైసీపీ నాయకులు, కౌన్సిలర్లు, అభిమానులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి, సంబరాలు చేశారు. నంద్యాల పట్టణ శివారులోని ఎస్సార్బీసీ కాలనీలోని పరివర్తన లైఫ్ సెంటర్ నందు కేక్ కట్ చేసి చిన్నారులకు నూతన వస్త్రాలు, అన్నదానం నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. అలాగే విజయబ్లడ్ బ్యాంక్ వారి సహకారంలో రక్తదానం నిర్వహించారు. కౌన్సిలర్ కృష్ణ మోహన్, వైసీపీ నాయకులు కిరణ్, లక్ష్మినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, వైసిపి మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైగర్ శివ, పార్థుడు, భాస్కర్ రెడ్డి, శేఖర్, దుర్గాప్రసాద్, ఎర్రన్న హాజరయ్యారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. ఆరుగురికి గాయాలు

**విశాలాంధ్ర-అవుకు:** మండలంలోని పాత చెర్లోపల్లి మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఆరుగురికి గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు రామాపురం నుండి అవుకు వస్తున్న ఆటో తాడపత్రి వైపు వెళుతున్న బొలేరో వాహనం పాత చర్లపల్లి వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో నులక రాముడు (63) మృతి చెందగా ఆనంద శర్మ, లక్ష్మీదేవి, ఆటో డ్రైవర్ లతీఫ్, పుల్లమ్మలు తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆనంద్ శర్మ, లక్ష్మీదేవి, లతీఫ్, పుల్లమలను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతి చెందిన నూలక రాముడు మృతదేహానికి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరము మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడు కుమారుడు నులక రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

## కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది

**విశాలాంధ్ర - చాగలమర్రి :** మండలంలోని నేలంపాడు గ్రామంలో వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని నేలంపాడు గ్రామంలో గురువారం సాయంత్రం పర్యటించారు. గ్రామంలో-చేరిన వరద నీటిలోనే పర్యటించారు. దాదాపు మోకాటిలోతు నీటిలో గ్రామంలో నడుచుకుంటూ వెళ్లి ఇళ్లల్లో చేరిన వరదనీటి ప్రవహాన్ని పరిశీలించారు. నీట మునిగి దెబ్బతిన్న సమీప పంట పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కడి నుంచే ఆర్డీవో, జిల్లాకలెక్టరుకు సమాచారం అందజేసి, గ్రామంలో ప్రజలకు ఏమి కావాలో అవన్నీ తక్షణమే చేయాలని అధికారులకు తెలియజేశారు. గ్రామంలోని టిడిపి నాయకులు, సంబంధిత అధికారులు ప్రతి ఇంటికి నిత్యవసరుకులు పంపిణీ చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగానీట మునిగిన వారి కుటుంబాలకు సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు విజయ్‌కుమార్, సింగిల్ విండో అధ్యక్షులు ఉసేన్ రెడ్డి, టిడిపి నాయకులు వెంకటేశ్వర్రెడ్డి, జనార్ధర్రెడ్డి, లక్ష్మీరెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన రైతు సంఘం నాయకులు

**విశాలాంధ్ర - రుద్రవరం:** మండల కేంద్రంలోని దళిత కాలనీలో నివాసముంటు ఇటీవలే మృతి చెందిన దాసరి అబ్రహం కుటుంబాన్ని మండల రైతు సంఘం అధ్యక్షుడు గురెడ్డి పరామర్శించారు. గురువారం రైతు సంఘం మండల అధ్యక్షుడు సభ్యులతో కలిసి మృతి చెందిన అబ్రహం కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ఓదార్పును అందించారు. ఈయన వెంట పలువురు రైతు సంఘం నాయకులు, దళితులు ఉన్నారు.

## చలో మెడికల్ కాలేజ్ పోస్టర్ విడుదల

**విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్:** బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదేశాల మేరకు గురువారం బనగానపల్లె వైసీపీ కార్యాలయం నందు చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమం పోస్టర్‌ను అవుకు మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి విడుదల చేశారు. 19న శుక్రవారం నంద్యాలలో నిర్వహించబోయే చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని విజయవంతం చేయమని వైసీపీ కార్యకర్తలకు ఆయన పిలుపు నిచ్చారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడానికి సిద్ధమైన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిద్దాం అని, పేద విద్యార్థుల వైద్య విద్యను సాకారం చేద్దాం అని తెలిపారు. ఏపీలో 17 మెడికల్ కాలేజీలను తెచ్చిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదని, 750 ఉచిత మెడికల్ సీట్లను అందుబాటులోకి తెచ్చిన విద్యా ధాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. నేడు మెడికల్ కళాశాలల నిర్వహణ తమ చేత కాదం టున్న కూటమి ప్రభుత్వం, పేదవానికి వైద్య విద్యను అందించలేక పోతున్న కూటమి ప్రభుత్వం అని తెలియజేశారు. జిల్లా వైసీపీ పార్టీ ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైసీపీ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి అంబటి రవికుమార్ రెడ్డి, బనగానపల్లె మండల యువజన విభాగం అధ్యక్షుడు తూర్పింటి శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలాలు వచ్చేంత వరకు పోరాటం ఆగదు

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల:** పట్టణంలో అర్హులైన ఇల్లులేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ప్రభుత్వం ఇచ్చేంతవరకు మా పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు తెలిపారు. గురువారం స్థానిక నేషనల్ పీజీ కాలేజ్ ఆవరణలో మహిళా సమాఖ్య పట్టణ సమావేశం మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో నాలుగు విడతల్లో సచివాలయాల దగ్గర, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇల్లు లేని, నిరుపేదలతో వేల మందితో వ్యక్తిగత అర్జీలు ఇప్పించడం జరిగిందన్నారు. ఆర్జీలను వెరిఫై చేయడంలో సచివాలయ ఉద్యోగులు, మున్సిపాలిటీ అధికారులు, తహశీల్దార్ కార్యాలయ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నరన్నారు. వెంటనే ఇల్లులేని, నిరుపేదలను గుర్తించి వారికి ప్రభుత్వం చెప్పిన విధంగా పట్టణంలో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి పక్కా ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఏపీ మహిళా సమాఖ్య నంద్యాల పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా పద్మావతి, ఉపాధ్యక్షులుగా సరోజమ్మ, రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా సుశీలమ్మ, సహాయ కార్యదర్శులుగా రమీజబి, వరాలు, కోశాధికారిగా సునీతతోపాటు 21 మందితో ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో 50 మంది మహిళలు పాల్గొనడం జరిగింది. ఈసమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.సోమన్న, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## పెండింగ్ అంశాలను వేగవంతంగా పరిష్కరించండి

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల:** నంద్యాల జిల్లాలో వివిధ పరిశ్రమలు, విద్యాసంస్థలు, సంక్షేమ వసతి గృహాల ఏర్పా టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రెవిన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్ఓ, ఆర్డీఓలు, సంబంధిత మండల తహసీల్దార్లు, తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, సామాజిక మౌలిక సదుపాయాల విస్తరణలో భూసేకరణ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయిలో రైతులు, అసైన్‌దారులతో సమన్వయం చేసుకొని స్పష్టమైన నివేదికలు పంపాలని జాయింట్ కలెక్టర్, సంబంధిత రెవిన్యూ అధికారులను ఆమె ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లాలో కుసుం ప్రాజెక్టు కోసం మిద్దూరులో 162 ఎకరాలు, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టుల కోసం రుద్రవరం, చాగలమరి, ఆళ్లగడ్డ ప్రాంతాల్లో కలిపి 315 ఎకరాలు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ కోసం డోన్, బేతంచర్లలో 2,860 ఎకరాలు, ఎంఎస్ఎంఈ ప్రాజెక్టు కోసం సుగాలి మెట్టలో 49 ఎకరాలను కేటాయించినట్లు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీఓలు విశ్వనాథ్, నరసింహులు పాల్గొన్నారు.

# నేలంపాడు అతలాకుతలం

- నేలంపాడులో వరద
- నీట మునిగిన పంట పొలాలు
- 700 ఎకరాల్లో పంటలు నీట మునక



నీట మునిగిన పంట పొలాలు



నీట మునిగిన బెండ



నీట మునిగిన జూట్

గ్రామంలో చేరిన వరద నీరు

**విశాలాంధ్ర - చాగలమర్రి:** మండలంలోని నేలంపాడు గ్రామంలో గత రాత్రి, గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి నేలంపాడు అతలాకుతలం అయ్యింది. గ్రామ సమీపంలోని కడప జిల్లా పరిధిలోని జంగాలపల్లె, కొట్టాల పల్లె గ్రామాలు ఎగువ ప్రాంతంలో ఉండడంతో అక్కడ కురిసిన వర్షపు నీరు, నేలంపాడులో కురిసిన భారీ వర్షం కలసి వరదగా మారింది. దీంతో ఒక్కసారిగా వరద నీరు గ్రామంలోకి చేరింది. గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట దాదాపు మోకాటి లోతు నీరు ప్రవహిస్తుంది. గ్రామం పరిసర ప్రాంతాల్లో దాదాపు 700ల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. మండలం లోని నేలంపాడు, గొట్లూరు పరిధిలోని పంట పొలాలు 700 ఎకరాల్లో నీట ముని గాయి. ప్రధానంగా జూట్(జనపనార), బెండ, మొక్కజొన్న, కంది, జొన్న, వరి పంటలు నీట మునిగాయి. పంటలు మునిగిపోయేంత నీరు పంట పొలాల్లోనే ప్రవహిస్తుంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## డోన్ అక్రెడిటేషన్ జర్నలిస్ట్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

**విశాలాంధ్ర -డోన్ రూరల్ :** డోన్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షులు విజయ మోహన్ నాయుడు, శివ రామయ్య ఆచారి తెలిపారు. బుధవారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసి, ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే పాత్రికేయులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నిజాలను నిక్కచ్చిగా రాసే పాత్రికేయులపై దాడులు జరగడం బాధాకరమన్నారు. అందరూ సమిష్టిగా హక్కులను కాపాడు కోవలసిన అవసరం ఉందన్నారు. డోన్ వర్కింగ్ జర్నలిస్టుల నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గౌరవ సలహాదారూలుగా వి.నాగరాజు, క్రిష్ణమోహన్, ఎస్.రాజు, అధ్యక్షులుగా కె.శేఖర్, ఉపాధ్యక్షులుగా వెంకటేష్ (సూర్య), జి.సుధాకర్ (సివిఆర్), ప్రధాన కార్యదర్శిగా జె.మల్లికార్జున (విశాలాంధ్ర), సహాయ కార్యదర్శులుగా మణిధర్ (ఆంధ్రజ్యోతి), (10టీవీ), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.మురళి (ఆంధ్రజ్యోతి), కోశాధికారిగా ఎస్.కళ్యాణ్ (ఏబియన్)తో పాటు కమిటీ సభ్యులుగా లక్ష్మి నారాయణ, రామాంజినేయులు, ఖాదర్, బాలరాజు, సుధాకర్, తారక్, శేఖర్ రెడ్డి, రవి, వలి బాష, రామయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## ప్రారంభమైన నంద్యాల దస్తావేజు లేఖర్‌ల సమ్మె

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల:** నంద్యాల దస్తావేజు లేఖర్ల సమ్మె (పెన్ డౌన్) గురువారం ప్రారంభమైంది. స్థానిక సబ్ రిజిస్టర్ కార్యా లయం నుండి నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యా లయం ఎదుట దీక్షలను వారు ప్రారంభించారు. జిల్లా స్టాంప్ రైటర్స్ అండ్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఫరూక్, రమేష్‌లు మాట్లాడుతూ నేటి నుండి వరసగా మూడు రోజులు తమ పనులకు స్వస్తి పలికి పెన్ డౌన్ ప్రకటించి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం అనుసరిస్తున్న 2.0 విధానంలోని ఆధార్ ఓటిపి, మొబైల్ ఓటిపి, పిడీఎఫ్ ఫీడింగ్ సమస్యలు, ప్రైవేట్ అటెండెన్స్ వగైరా సమస్యల వల్ల ప్రజల రిజిస్ట్రేషన్ వ్యవహారాలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని డిమాండు చేస్తూ జిల్లాకు చెందిన దస్తావేజు లేఖర్లు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు మాలిక్, శివరాం, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, భాష, ఆది నారాయణ రెడ్డి, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి : ఏఐటీయూసీ

**విశాలాంధ్ర - నందికొట్కూరు :** వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘు రామమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురు వారం గ్రామ సేవకుల సంఘం ఆధ్వర్యంలో నందికొట్కూరు తాసిల్దార్ కార్యాలయం ముందు వారి సమస్యల పరిష్కారం కొరకు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమం గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నందికొట్కూరు మండల అధ్యక్షులు మహేష్ కార్యదర్శి శివన్న అధ్యక్షత నిర్వహించారు. వారు చేస్తున్న న్యాయమైన కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి సంపూర్ణ మద్దతు తెలిపి మాట్లాడుతూ వీఆర్ఏలకు పే ఆఫ్ స్కేల్ అమలు చేయాలని, అర్హులైన గ్రామ సేవకులకు వీఆర్వో అటెండరు, వాచ్మెన్, డ్రైవర్లుగా 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకులు సుధాకర్, బి.పవన్, రమణ, మాధవి, లక్ష్మమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## గోరుకల్లు రిజర్వాయర్ రక్షణ పనులు నాణ్యతతో చేపట్టండి

**విశాలాంధ్ర-పాణ్యం :** మండల పరిధిలోని గోరుకల్ రిజర్వాయర్ వరకు రూ.6.29 కోట్ల వ్యయంతో నిర్మించిన రహదారి పనులను జిల్లా కలెక్టర్ రాజకుమారి గురువారం సాయంత్రం పరిశీలించారు. కొండజుటూరు, గోరుకల్, ఎస్ కొట్టాల, దుర్వేసి గ్రామాలను కలుపుతూ 13.125 కి.మీ. పొడవున రూ.6.29 కోట్ల వ్యయంతో పూర్తయిన రహదారి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రహదారి నిర్మాణం వల్ల నాలుగు గ్రామాలకు సులభ రవాణా సౌకర్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు సంబంధించి రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. రహదారి పనులు నాణ్యత ప్రమాణాలకు లోబడి, సమయానికి పూర్తయ్యేలా అధికారులు కృషి చేసారన్నారు. అనంతరం గోరుకల్లు రిజర్వాయర్ బండ్‌పై చేపట్టిన రక్షణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ పనులకు 2.5 కోట్ల రూపాయల డీఎంఎఫ్ నిధులు ద్వారా మంజూరయ్యాయని, అందులో ఇప్పటివరకు రూ.60 లక్షల విలువైన పనులు పూర్తయ్యాయని ఎస్సార్బీసీ ఎస్ఈ శుభకుమార్ కలెక్టర్‌కు నివేదించారు. రిజర్వాయర్ బండ్ పై రక్షణ పనులు పూర్తయితే నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, సాగు అవసరాలు తీర్చడంతో పాటు స్థానికులకు త్రాగునీటి సౌకర్యం చేకూరుతుందని కలెక్టర్ అన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు, సాగు నీరు, రవాణా సౌకర్యాలు కల్పించడమే ఈ పనుల ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల అమలులో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకుండా త్వరితి గతిన పూర్తి చేసి ప్రజలకు ఉపయోగకరంగా మార్చాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

## మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ:** తాలూకాలోని మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర వైసీపీ ప్రధాన కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత 15 రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, మొక్కజొన్న చేతికచ్చే సమయానికి వర్షం పడడంతో పంటకు తెగులు రావడం జరిగిందన్నారు. కోత కోసిన పంటను రోడ్లమీద ఆరపోసుకున్న వారి పరిస్థితి వర్షం రాకతో దైన్యంగా మారిందన్నారు. ప్రభుత్వం బాధ్యత తీసుకొని రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో ఉల్లిగడ్డ, టమోటా రైతుల పరిస్థితి దయనీ యంగా ఉన్నట్లే మొక్కజొన్న రైతుల పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కొత్త దందాలు ఆపాలని రైతులకు, వ్యాపారస్తులకు నష్టం చేసే చర్యలను ప్రోత్సహించవద్దని భూమా కిషోర్ రెడ్డి అన్నారు.

# తొట్టి సరే.. నీరేది

**విశాలాంధ్ర - రుద్రవరం:** గ్రామాలలోని మూగజీవాల దాహార్తిని తీర్చాలన్న లక్ష్యంతో గ్రామాల చివరలో మూగజీవాల నీటి తొట్లను నిర్మించి తొట్టికి నీటిని పట్టి దాహార్తిని తీర్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళుతుంది. ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచే విధంగా కొన్ని గ్రామాలలో తొట్లు నిర్మించి నీటి కుళాయిలను ఏర్పాటు చేయకుండా మూగజీవాల దాహార్తిని తీర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వివరాలలోకి వెళితే మండలంలో 38 మూగజీవాల నీటితోట్లు మంజూరు కాగా ఇప్పటివరకు 24 నీటి తొట్లను నిర్మించి పూర్తి చేశారు. మిగిలిన 14 నీటి తొట్లను నిర్మించాల్సి ఉంది. మండలంలోని పేరూరు గ్రామంలో మూగజీవాల నీటితోటిని నిర్మించి నీటి కొళాయిని మరిచారు. దీంతో నీటి తొట్టి ఎండిపోతుంది ఇలా తొట్లను నిర్మించి నీటి కుళాయిలను ఏర్పాటు చేయకపోవడంతో మూగ జీవాల దాహర్తి ఎలా తీరుతుందని ఆయా గ్రామాల రైతులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి మూగజీవాల నీటి తోట్ల వద్ద నీటిని సరఫరా చేసే పైపులను ఏర్పాటు చేసి మూగజీవాల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

## సర్వే లను వేగవంతం చేయండి

**విశాలాంధ్ర - వెలుగోడు :** పట్టణంలోని ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు సచివాలయాలతో పాటు బోయరేవుల సచివాలయం ను గురువారం ఎంపిడిఓ మధుసూదన రెడ్డి సందర్శించారు. సచివాలయంలోని సిబ్బంది హాజరు పట్టిని పరిశీలించి, హాజరు కాని సిబ్బందిని గూర్చి ప్రశ్నించారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలను వేగవంతం చేయవలసిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంపిడిఓ మురారి గ్రామ కార్యదర్శి నరేంద్ర పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల :** పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు పాటుపడాలని కోటపాడు పంచాయతీ కార్యదర్శి అమరావతి అన్నారు. గురువారం గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్మికులు చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. మురుగు కాలువల పరిశుభ్రత,రోడ్లపై వేసిన చెత్తా చెదారం, కంప చెట్లను తొలగించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధా న్యత ఇవ్వాలన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిలవ లేకుండా చూడాలని, చెత్తాచెదారని వీధుల్లో తెలిపారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెంది అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందన్నారు.

**సర్పంచ్ ఆధ్వర్యంలో:** మండల కేంద్రంలో సర్పంచ్ శివ రాముడు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం-1, రైతు సేవా కేంద్రాల చుట్టూ జెసిబితో కంప చెట్లను తొలగించారు. చెత్తాచెదారంతో పాటు పిచ్చి మొక్కలు కంప చెట్లను తొలగించి పరిశుభ్రతను నెలకొల్పారు.

## యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల:** పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తుండగా పెద్దకొట్టాల సుగాలి మెట్ట వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఎస్ కెడీ డ్రెస్సెస్ మహీంద్రా కుమారుడు మహావీర్(15) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను కలిసి చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందారని వార్త తెలిసి వారి కుటుంబ సభ్యుల బాధ తీర్చలేనిదనిచ ఈ కష్ట సమయంలో వారికీ అండగా ఆ భగవంతుడు ఉండాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఫిరోజ్ భరోసా కల్పించారు. ఈ ప్రమాదంలో గాయపడి ఐసీయూలో చికిత్స పొందుతున్న మరొక యువకుడి ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని ఆ కుటుంబానికి అండగా ఉంటామని ఫిరోజ్ భరోసానిచ్చారు.

## సంస్మరణ సభను జయప్రదండి

**విశాలాంధ్ర - డోన్:** సీపీఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ పార్లమెంటు సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఐ డోన్ మండల కార్యదర్శి బి.నారా యణ, పట్టణ కార్యదర్శి మోటా రాముడు, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్.కె.రామ మోహన్‌లు అన్నారు. గురువారం డోన్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ శుక్రవారం పట్టణంలోని షాదిఖానా ఫంక్షన్ హాల్‌లో సురవం సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి 1994లో డోన్ నియోజకవర్గం నుంచి శాసన సభకు అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి మీద పోటీ చేసి 30 వేల ఓట్లు సాధించారన్నారు. ఆయన అభిమానులు సానుభూతిపరులు పరిచయస్తులు అందరూ ఆహ్వానితులే అని పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## క్షత్రగాతులకు మెరుగైన వైద్యం అందించాలి

**విశాలాంధ్ర - బనగానపల్లె:** అవుకు మండలం, చెర్లోపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆటో, బోలెరో ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు కావడం పట్ల ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తీవ్రంగా గాయపడి అవుకు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షత్రగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. గాయపడిన వారిని అవసరమైతే నంద్యాల జిల్లా ప్రభుత్వా సుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

## మద్దిలేటి స్వామికి ఆర్టీసీ బస్ సర్వీసు

**విశాలాంధ్ర - బనగానపల్లె:** మద్దిలేటి స్వామి దేవస్థానానికి బనగానపల్లె నుండి ఆర్టీసీ బస్ సర్వీస్ ఏర్పాటు చేసినట్లు డిఎం కిషోర్ కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 20వ తేదీన రాష్ట్ర రోడ్లు, భవనాలు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మద్దిలేటి స్వామి దేవస్థానానికి ప్రత్యేక బస్సు సర్వీసును ప్రారంభించనున్నట్లు డీఎం తెలిపారు. శుక్రవారం, శనివారం యాగంటి దేవస్థానం, కటికవానుకుంట మీదుగా మద్దిలేటి స్వామి దేవస్థానానికి బస్ సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. ప్రజలు, భక్తులు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## భవననిర్మాణం పరిశీలన

**విశాలాంధ్ర - చాగలమర్రి:** పట్టణంలో రూ.22.5లక్షలతో జరుగుతున్న నూతన గ్రంథాలయ భవన నిర్మాణాన్ని గ్రంథాలయ శాఖ జిల్లా కార్యదర్శి ప్రకాష్ గురువారం పరిశీలించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో జరుగుతున్న భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భవనాలు లేని గ్రంథాలయాలను పరిశీలించి, నూతన భవనాలకై ప్రతిపాదనలు పంపిస్తున్నామని వివరించారు. గ్రంథాలయాల్లో అన్నిరకాల పుస్తకాలను పాంకులకై అందుబాటులో ఉంచామని తెలిపారు. స్థానిక గ్రంథాలయ అధికారి రామచంద్రుడు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 19, సెప్టెంబర్ 2025

## మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : బ్రిటీష్ వలస పాలకుల నుండి మాతృభూమి విముక్తి కోసం 23 ఏళ్ల వయసుకే ప్రాణాలను అర్పించిన విప్లవ యువ కిశోరం సర్దార్ భగత్ సింగ్ 118 వ జయంతి సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నగరంలో సెప్టెంబర్ 27వ తేదీన మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని రక్తదాన క్యాంపును విజయ వంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్య దర్శులు ఇ.శ్రీరాములు, కె.శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. గురువారం ఏఐవైఎఫ్ నగర ముఖ్య నాయకుల సమావేశం నగర అధ్యక్షులు బి.నాగరాజు అధ్యక్షతన సీఆర్ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరాములు, శ్రీనివాసులు మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ అతిచిన్న వయసులోనే స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా స్వాతంత్ర అనంతరం కూడా దేశంలో అసమానతలులేని సమాజం కావాలని, పౌరులం దరికి సమాన హక్కులు కావాలని, దోపిడి నశించాలని కలలు కన్నాడని, అలాంటి మహావీరుడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఏఐవైఎఫ్ లక్ష్యమన్నారు. ఆయన ఉద్యమస్ఫూర్తితో సమాజంలో దోపిడి వ్యవస్థపై ఉద్యమించ డమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో సాధారణ ప్రజలకి, పేద ప్రజలకి ఉపయోగపడే విధంగా సెప్టెంబర్ 27వ కర్నూలు నగరంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి ఎం.బీసన్న, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ, నగర నాయకులు చంటి, అఖిల్, సూర్యమధు, శివ,రసూల్, మధు, చిన్న, రవి, శ్రీనివాసులు, శివకృష్ణ పాల్గొన్నారు.

## జనగణనలో కుల గణన చేపట్టాలి : బి.గిడ్డయ్య

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: జనగణనలో కుల గణన చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం సీఆర్‌భవన్ నందు జరిగిన విలేక రుల సమా వేశంలో గిడ్డయ్య మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు సంబం ధించి 143 కులాలు ఉన్నాయని, శ్రమశక్తితో సంపదను సృష్టించే వెనుకబడిన తరగతులను యంత్రాలుగా చూస్తున్నారే తప్ప రాజ్యాధికారంలో వారిని భాగస్వాములు చేయడం లేదని విమర్శించారు. తెలం గాణ, కర్ణాటక రాష్ట్రాలలో అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకొని జన గణనలో కులగణన చేసి జనాభా ప్రతిపాదిక ప్రకారం స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని చూస్తూ ఉంటే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి జనగణనలో కుల గణన చేయదానికి ముందుకు రాకపోవడం సమంజసం కాదన్నారు. దేశంలో ఉన్న అందరూ ముఖ్యమంత్రుల కంటే తానే సీనియర్ అని, రాష్ట్రంలో ఎస్సీల, బీసీల రాజకీయంగా ఎదుగుదలకు పాటుపడే ఏకైక పార్టీ తమదే అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు నాయుడు మరి కులగణన ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. మన రాష్ట్రంలో కుల గణన చేసి జనాభా ప్రతిపాదికన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కులగణన చేపట్టడానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరుతూ అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులను ఆహ్వానించి రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకుని వస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నాయకులు రామాంజనేయులు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆదోనిని జిల్లాగా ప్రకటించాలి

విశాలాంధ్ర- పత్తికొండ: ఆదోనిని తక్షణమే జిల్లాగా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తికొండ ప్రాంత వాసులకు కర్నూలు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వంద కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుందని, ఆదోనికి వెళ్లేందుకు కేవలం 35 నుండి 40 కిలోమీటర్లు ఉండడం వలన ప్రయాణ భారం తగ్గుతుందని, పరిపాలన సౌలభ్యం కోసం ఆదోనిని జిల్లాగా ప్రకటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

## పంట పొలాలును కాపాడండి సార్..

విశాలాంధ్ర - చిప్పగిరి: ఖరీఫ్ సీజనులు సాగు చేసిన పంటలు చెరువు నీటితో మునిగి పోయాయని, తమ పంటలు కాపాడండి సార్ రైతులు కోరారు. గురువారం ఇంచార్జీ తహసీల్దారు ఇజాజ్ అహ్మద్‌కు రైతులు వినతిపత్రం సమర్పించారు. మండల పరిధిలోని బెల్డోన గ్రామానికి చెందిన రైతులు మండల మాజీ ఉపాధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు ముంపుకు గురైన పొలాలపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని నగరడోన గ్రామ పంచాయతీ మజార గ్రామమైన తిమ్మాపురం గ్రామానికి సంబంధించిన మైనర్ ఇరిగేషన్ చెరువు అధిక వర్షాలతో పూర్తి సామర్థ్యంతో నీరు నిలువ కావడంతో పైన ఉన్న పట్టా పొలాలలో సాగు చేసిన పంటలు నీట మునిగాయని మునిగిన పంటలను పరిశీ లించి రైతులకు న్యాయం చేయాలని వినత పత్రం ద్వారా తెలిపారు. ఇందుకు స్పందించిన ఇంచార్జ్ తహసీల్దార్ ఇజాజ్ అహ్మద్ మాట్లా డుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యను పరిష్కరిస్తా మని, చెరువు మైనర్ ఇరిగేషన్ అధికారులకు తెలియజేస్తామన్నారు. మారయ్య, సుంకన్న, ఓబులేసు, తిప్పన్న, నాగేష్ పాల్గొన్నారు.

## 20న కర్నూలు మార్కెట్‌లో ఉల్లి క్రయ, విక్రయాలు జరుగుతాయి : జేసీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఈ నెల 19న ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్‌లో, 20న తేదీన కర్నూలు మార్కెట్ యార్డ్‌లో ఉల్లి క్రయ విక్ర యాలు జరుగుతాయని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఉల్లి రైతులు తమ పంటను సెప్టెంబర్ 19న ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్‌కు, 20న కర్నూలు మార్కెట్ యార్డ్‌కు తీసుకువెళ్లవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## 20న పంటల పరిశీలన : ఏపీ రైతుసంఘం

విశాలాంధ్ర - కర్నూలు: అధిక వర్షాలు, గిట్టుబాటు ధరలు లేక నష్ట పోయిన ఉల్లి, పత్తి, టమోటా పంటలను పరిశీలించడానికి ఈనెల 20న ఏపీ రైతు సంఘం జిల్లాలో విస్తృతంగా పర్యటించడం జరుగుతుందని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం గురువారం ఓ ప్రకటనలు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఉల్లి, పత్తి టమోటా, మిర్చి పంటలు అకాల వర్షాలకు పంటలు దెబ్బ తిన్నాయని తెలిపారు. పత్తి ఎర్ర పురుగు వల్ల నెల రాలిపోతుంది పత్తి పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని ఉల్లి, టమోటా పంట బాగా పండిన మార్కెట్లో సరైన ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని, పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎంత సేపు ఉన్నా అమరావతి అభివృద్ధి, విమానాశ్రయులు, ఓడరేవులుతప్ప రైతుల సమస్యల పట్టించు కోవడం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి, ప్రజాప్రతినిధులు, క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలు తెలుసు కోవాలన్నారు. ఈ నెల 20వ తేదీన జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతుల సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని, రైతులు ఎదుర్కొం టున్న సమస్యలను సంబంధిత శాఖ అధికారుకు తెలియచేస్తామన్నారు.

## కోట్ల టీం ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర-గూడూరు: మాజీ కేంద్ర సహాయక మంత్రి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా టిడిపికి చెందిన కోట్ల వర్గీయులు స్థానిక మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. గురువారం నగర పంచాయతీ లో కర్నూలు పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ చరణ్ కుమార్ ఆధ్వర్యంలో కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలను టిడిపి శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చరణ్ కుమార్ మాట్లాడుతూ నీతికి నిజాయితీకి కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి నిలువెత్తు నిదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమలరెడ్డి, సురేష్, వాల్మీకి అధ్యక్షుడు మధు, నారాయణ, నాయుడు, నాగరాజు, కిషోర్ వర్మ, కేశవులు, లక్ష్మన్న, గోవిందు పాల్గొన్నారు.

## ఉల్లి పంటలను పరిశీలించిన ఆర్డీవో

విశాలాంధ్ర - కోడుమూరు : మండలంలోని వర్కూరు గ్రామ పరిధిలోని ఉల్లిపంటలను కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సందీప్ కుమార్ పరిశీలించారు. గురువారం కోడుమూరు చేరుకున్న ఆయన మండల తహసీల్దార్ నాగరాజుతో కలిసి నేరుగా వర్కురు గ్రామ పరిధిలోని ఉల్లి పంటల పొలాలకు వెళ్లారు. అక్కడ ఉల్లి పంట ఈ-క్రాప్ నమోదు, దెబ్బతిన్న పంటలలో నష్టానికి గల కారణాలపై రైతులతో చర్చించారు. వర్కూరు గ్రామ రైతు దాసప్ప పొలమును సందర్శించి ఉల్లి పంట పెట్టుబడి, దిగుబడి, మార్కెటింగ్ తదితర వివరాలను ఆర్డిఓ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉల్లి సాగు చేసిన కొందరు రైతులు మద్దతు ధర రూ.2000లు ప్రకటించి ఉంటే బాగుండేదని ఆర్డిఓతో అన్నారు. కౌలు రైతు వెంకటేశ్వర్లు పొలం మీద ఉన్న ఉల్లి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున కనీస గిట్టుబాటు ధర రైతులకు ఏడాది పొడవునా ఉంటుందన్నారు. అనంతరం పట్టణ శివారులోని ఉల్లి వ్యాపారులతో సమావేశమై రైతులు నుండి ఎంత ధరకు ఉల్లి పంటను సేకరిస్తున్నారనే అంశాలపై మాట్లాడారు. ఆర్ఐ అశోక్ కుమార్, వీఆర్వో బీరప్ప ఇం చార్జి మండల సర్వేయర్ ఈశ్వర్, సర్వేయర్లు రాఘవేంద్ర పాల్గొన్నారు.

## ఉచితంగా మొక్కల పంపిణీ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు నగరాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దే లక్ష్యంతో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా హరిత ఆంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఇంటి మేడపై, అపార్టుమెంట్ల బాల్కనీలలో మొక్కలు, పండ్ల చెట్లు, కూరగాయలు పెంచే వారిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఆసక్తిగల వారు తమ వివరాలను సంబంధిత సచివాలయ పరిధిలోని శానిటేషన్ కార్యదర్శుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20న నగరపాలక సంస్థ కార్యాలయం, 16 శానిటేషన్ డివిజన్లలో వచ్చ సుంకేసుల, పెల్టో ఫోరం, గుల్మోహర్, ఎర్ర సుంకేసుల, కొండతంగేడు, గంగరావి, సీతా ఫలం, తపస్సి, కానుగ, జామ, వేప వంటి తొమ్మిది రకాల మొక్కలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

## ఎల్లార్తిలో వైద్య శిబిరం ఏర్పాటు

విశాలాంధ్ర - హొళగుంద: ఎల్లార్తి హజరత్ షేక్షావలి, షాషావలి 363వ ఉరుసు సందర్భంగా గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ కుర్వ చాముండేశ్వరి ప్రారంభించారు. ఉరుసులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని ఎవరైనా అనారోగ్యానికి గురైతే వైద్యులు వైద్య చికిత్స అందించి, మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రజలు, భక్తులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భక్తులకు అన్ని వసతులు కల్పించడానికి చర్యలు తీసుకున్నమని అన్నారు. ఉరుసు మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ చంద్రశేఖర్, కరీం, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులపై విద్యుత్ చార్జీల మోత

విశాలాంధ్ర - కోడుమూరు: చేనేత కార్మికులపై విద్యుత్ ఛార్జీల మోత కొనసాగుతూనే ఉందని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుగుడే మాధవ స్వామి అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మహబూబ్ తో కలిసి చేనేత కార్మికులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 7న చేనేత దినోత్సవం సందర్భంగా సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేనేత కార్మికులకు నేటి నుండి 200 ఉచిత విద్యుత్తు అమలులోకి వస్తుందని చెప్పారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కరెంటు బిల్లులు చార్జీల మోత ఉందని, చేనేత కార్మికులు బిల్లులు కట్టలేక లబోదిబో మంటున్నారని పేర్కొన్నారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చేనేత కార్మికుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా చేనేత అధ్య యన యాత్ర కొనసాగుతుందని తెలిపారు. యాత్రలో భాగంగా మచిలీపట్నం ప్రాంతంలోని పెడమ గ్రామం నుంచి మొదలైన చేనేత అధ్యయన యాత్ర మన కర్నూలు జిల్లాలో ఈనెల 24, 25వ తేదీల్లో పర్యటిం చనుందని వివరించారు. కేవలం చేనేత కార్మికుల సమస్యలపై చేనేత అధ్యయన యాత్ర కొనసాగు తుందని చెప్పారు. జిల్లాలో రెండ్రోజుల పాటు సాగే చేనేత అధ్యయన యాత్రను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌస్, బి.విజయ్, సాయి, శ్రీరాములు, కె.గోపి, ఎం.శ్రీనివా సులు, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రేడింగ్ చేసి మార్కెట్‌కి తీసుక రావాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: పక్వానికి వచ్చిన ఉల్లిని గ్రేడింగ్ చేసి మార్కెట్ కి తీసుకుని రావాలని, ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఇంచార్జి కలెక్టర్ డా.బి.నవ్య సూచించారు. గురువారం ఎమ్మిగ నూరు మార్కెట్ యార్డ్‌లో ఉల్లి క్రయ విక్రయాలను రిబ్బన్ కట్ చేసి, ప్రారంభించిన అనంతరం సంబం ధిత రైతులతో ఇంచార్జి కలెక్టర్ సమీక్ష నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లా డుతూ కర్నూలు మార్కెట్ యార్డ్‌లో ఉల్లి స్టాక్ పాయింట్ ఎక్కువ ఉన్నందువలన రెండు రోజులు తాత్కాలికంగా ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ లో ఉల్లి క్రయ విక్రయాల నిర్వహణ జరుగుతుందని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్‌కు 18 మంది రైతులు 1500 క్వింటాలకుపైగా వరకు ఉల్లిని మార్కెట్ యార్డుకు తీసుకువచ్చారన్నారు. రైతులు పక్వానికి, వచ్చిన ఉల్లిని మాత్రమే గ్రేడింగ్ చేసి మార్కెట్‌కి తీసుకుని రావాలని ఇంచార్జ్ కలెక్టర్ తెలిపారు. రైతులు ఉల్లి పంట నాటిన 110 రోజుల తర్వాత పక్వానికి వచ్చిన తర్వాత కోత కోయాలని తక్కువ రోజుల్లో పంట కోత కోయడం ద్వార పంట సరిగ్గా ఉండదని, గిట్టుబాటు ధర సమస్యలు వస్తాయని ఇంచార్జ్ కలెక్టర్ అన్నారు. అనంతరం మార్కెట్ యార్డ్ లో ఉల్లి పంటను తీసు కుని వచ్చిన రైతులతో ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ పంట సాగు, ఉత్పత్తి, అమ్మకాల వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఉల్లి నాణ్యతను ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ పంటకాలం పూర్తయిన వాటినే కోత కోయాలని, పరిమితి చెందని వాటిని కోత చేయడం ద్వారా నష్టం వాటిల్లుతుందని రైతులకు సూచించారు. రైతులు తప్పనిసరిగా ఉల్లిని ఆరబెట్టి, గ్రేడింగ్ చేసి మార్కెట్ యార్డుకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య, మార్కెట్ యార్డ్ ఆర్‌జెడి సి.రామాంజనేయులు, ఎమ్మిగనూరు తహశీల్దార్ శేషపాణి పాల్గొన్నారు.

## రెడ్డి కార్పోరేషన్ ఏర్పాటు చేయాలనడం హర్షణీయం

విశాలాంధ్ర - నందవరం: ఏపీ అసెంబ్లీలో రెడ్డి కార్పొ రేషన్ ఏర్పాటు చేయాలని ప్రసంగించిన ఎమ్మిగ నూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డికి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన టిడిపి నాయకులు కృతజ్ఞతాభినందనలను తెలిపారు. గురువారం వారు విలేకరుల మాట్లా డుతూ 2024 ఎన్నికల్లో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలు, అన్ని కులాలకు సంబంధించిన కార్పొరేషన్లను ఏర్పాటు చేశారని, రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బీవీజే అసెంబ్లీలో తొలి రోజు అద్భుతమైన ప్రసంగించడం అభినందనీయమన్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పేద కుటుంబాలకు కార్పొరేషన్ ద్వారా నిధులను కేటాయించాలని తగిన గౌరవం, న్యాయం దక్కేలా, వారికి కావలసిన నిధులు సమృద్ధిగా ఇవ్వాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో కోరడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ అసోసి యేషన్ అధ్యక్షులు ఎన్ నారాయణరెడ్డి, రాయచోటి రామకృష్ణ రెడ్డి, చిన్నకొత్తలి సత్యరెడ్డి, గురజాల రాజేశ్వర్ రెడ్డి, నందవరం వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రీయ పోషణ్ కార్యక్రమం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: గర్భిణీలు బాలింతలు 0-5 నెలల పిల్లల్లో పోషకాహార లోపం తగ్గించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న తెలిపారు. బుధవారం మండలంలోని బైచిగేరి అంగన్వాడి-1 కేంద్రంలో ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ్ మా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు బరువు, ఎత్తు పరీక్షలు నెల నెలా సరి చూసుకోవాలన్నారు. రక్తహీనత రాకుండా మంచి ఆకుకూరలు, కూరగాయలు పోషిక విలువలు లభించే ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ పుష్పవతి, ఏఎన్ఎం సురేఖ, కావ్యశ్రీ, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

## కవి సమ్మేళనాలు భాషా అభివృద్ధికి దోహదపడుతాయి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : ప్రాచీన భాషల అభివృద్ధికి కవి సమ్మేళనాలు ఎంతో దోహదపడుతాయని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇంచార్జి వైస్ ఛాన్సులర్ ప్రొఫెసర్ పిఎస్‌షా వలీ ఖాన్ అన్నారు. గురువారం స్థానిక డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఈద్-ఎ-మీలాద్ -ఉన్ - నబీ సందర్భంగా ఒక రోజు కవి సమ్మేళన కార్యక్రమంను వర్సిటీ ఉర్దూ శాఖ, ఎన్‌సిపియుఎల్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంచార్జి వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పిఎస్‌షా వలీ ఖాన్ అధ్యక్షత వహించి, మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సమాజ శ్రేయస్సు కోసం నేర్పిన సూత్రాలను పాటిస్తూ ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. ఉర్దూ భాషా అభివృద్ధి కోసం కవి సమ్మేళనాలు, సెమినార్లు ఎంతో దోహదపడుతాయని అన్నారు. ముఖ్యఅతిథి ఎన్‌సిపియుఎల్ డైరెక్టర్ డాక్టర్ ఎండి షంసు ఇక్బాల్ మాట్లాడుతూ ఉర్దూ బాష వాడుక భాషల్లో ఒక మాధ్యమంగా పని చేస్తుందన్నారు. దేశంలో ఉన్న 300 ఎన్‌సిపియుఎల్ కేంద్రాల్లో ఉర్దూ యూనివర్సిటీ కేంద్రం ఒకటి కావడం విశేషం అన్నారు. ఈ కేంద్రం ద్వారా కవి సమ్మేళనం నిర్వహించడం ద్వారా ఉర్దూ భాషకు పూర్వ వైభవం తెచ్చేందుకు దోహదపడుతుందన్నారు. మరో ముఖ్యఅతిధి లతీఫ్ లౌబాలి దర్గా పిఠాదిపతులు సైయ్యద్ షా అబ్దుల్లా హుస్సేని బాద్షా ఖాద్రి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తా శాంతి, సోదరభావము, దైవ భక్తి కోసం కృషి చేశారని పేర్కొన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి ఇంచార్జి వీసీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ మాట్లాడుతూ ఉర్దూ భాషా ఒక కులానికో మరో మతానికి చెందినది కాదన్నారు. వ అనంతరం ఎన్‌సిపియుఎల్ కేంద్రంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అతిధులు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనం కార్యక్రమంలో కవులు అబ్దుల్ జిలాన్, అతవుల్లాహ్ ఖాద్రి, ఖాద్మి రసూల్, యాసీన్ బోఖారీ, హైదర్ నియాజ్, అజ్మత్, మునవర్, సైయ్యద్ జహీర్ అహ్మద్, జీబా ఫాతిమా తమ కవితలను వినిపించారు.

## నిత్యావసర సరుకులు ఉచితంగా ఇవ్వాలి



విశాలాంధ్ర - ఆదోని రూరల్: వ్యవసాయ కూలీల రైతులకు తొమ్మిది రకాల నిత్యవసర సరుకులను చౌక దుకాణం ద్వారా ఉచితంగా అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కొత్తూరు గంగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో డిపిఓ భాస్కర్, ఇంచార్జి ఎంపీడీఓ జనార్ధన్‌లకు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కొత్తూరు గంగన్న, సీపీఐ మండల కార్యదర్శి కళ్ళు బావి రాజు, ఏపీ రైతు సంఘం డివిజన్ కార్యదర్శి మదిరి ఎల్లప్ప, కౌలు రైతు సంగం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొని కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడారు 20 రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకి ఉపాధి కూలీలకు పనులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రామాలలో ఉపాధి లేకుండా నిరాశ్రయులుగా ఉన్న వ్యవసాయ కూలీలను గుర్తించి 50 కేజీల బియ్యము మంచి నూనె కందిపప్పు చెక్కెర వంటి తొమ్మిది రకాల నిత్యవసర సరుకులను ఉచితంగా అందించాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు పెండింగ్లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండిగిరి శేషప్ప,శంకరప్ప,కొత్తూరు హనుమంతు, సోమశేఖర్ రెడ్డి మునియప్ప, ఈరన్న, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## సంయుక్తంగా అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరంలో అనధికార లే అవుట్లను ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా ప్రజలు క్రమ బద్ధీకరించుకునేలా పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బంది అవసరమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. గురువారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పట్టణ విభాగ అధికారులు, ప్లానింగ్, అమినిటీస్, వెల్ఫేర్ కార్యదర్శులతో సమా వేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగ రంలో 150కిపైగా అనధికార లేఅవుట్లు ఉన్నాయని, వాటన్నింటినీ సంబంధిత ప్రజలు క్రమబద్ధీకరించు కునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ముందుగా ప్లానింగ్, అమినిటీస్, వెల్ఫేర్ కార్య దర్శులు సంయుక్త బృందంగా ఏర్పడి, ఆయా సచివా లయ పరిధిలో అనధికార లేఅవుట్లు, నిర్మాణాలను త్వరితగతిన గుర్తించాలని ఆదేశించారు. అనంతరం ప్లానింగ్ కార్యదర్శులు సేకరించిన కచ్చితమైన వివరాలపై సంతకం చేసి అందించాలని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణదారులకు తుది నోటీసులు జారీ చేయాలని, ఎల్ఆర్ఎస్ పథకంలో నమోదు చేసుకోకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవడంలో ఉపేక్షించొద్దని హెచ్చరించారు. ఎల్ఆర్ఎస్ పథకానికి ఇప్పటివరకు 843 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. నగరంలో ఒక్క అక్రమ నిర్మాణం మిగలకుండా ఎల్ ఆర్ఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరణ చేయాలని కమి షనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమి షనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమా ర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

## ఆశ.. నిరాశ అయిన వేళ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : డీఎస్సీ అభ్యర్థులకు ఆశ, నిరాశ ఎదురయ్యింది. కర్నూలో డీఎస్సీ టీచర్ పోస్టులు సాధించిన హతాహుటిన రాయలసీమ యూనివర్సిటీలో బస్సులో ప్రయాణానికి బయలు దేరడానికి సిద్ధంగా ఎంతో మంది సిద్ధంగా అందులో ఓ మహిళా డీఎస్సీ అభ్యర్థికి నిరాశ ఎదురయ్యింది. డీఎస్సీలో టీచర్ పోస్టింగ్ పత్రాలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో తీసుకోవాలని చెప్పడంతో హుటాహుటిన చంటి పిల్లల్ని తీసుకొని బయలుదేరే సమయంలో వర్షాల కారణంగా వాయిదా పడింది. డీఎస్సీలో టీచర్ పోస్టులు నిరాశ చెందారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న టీచర్ పోస్టుల కోసం ఎంతో తాపయాత్రపడి కష్టపడి చదివి, ఇంకా ఎన్ని రోజులు ఎదురు చూడాలంటూ ఎంతోమంది నిరాశ చెంచెందారు.

## ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంట గ్రామ శివారుల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్సై నిరంజన్ రెడ్డి గురువారం తెలిపారు. కల్లుకుంట గ్రామంలో ఎర్రమట్టిని అక్ర మంగా తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి నాలుగు ట్రాక్టర్లు, జేసీబీని పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు

విశాలాంధ్ర - ఆదోని: అసెంబ్లీలోనీ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు ఆధ్వర్యంలో గురువారం అసెం బ్లీలో ప్రివిలేజ్ కమిటీ కొత్తగా ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీకి ఎమ్మెల్సీ బీటి నాయుడు చైర్మన్‌గా బాధ్య తలు స్వీకరించారు. కమిటీ సభ్యులుగ జయేంద్ర భరత్, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పందుల రవీంద్ర బాబు, రఘురాం తలసీల రాజగోళ్ల రమేష్ యాదవ్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ, ప్రివిలైజ్ కమిటీ చైర్మన్ బీటీ నాయుడు మాట్లాడుతూ సభ్యుల హక్కులను కాపాడే దిశగా కమిటీ పని చేస్తుందని, కొత్తగా బాధ్యతలు చేపట్టిన సభ్యులం తా సభా, సభ్యుల గౌరవం నిలబెట్టేలా కృషి చేస్తామని తెలిపారు.

## ఛలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - పెద్దకడబూరు: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకర ణకు నిరసనగా నేడు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు మంత్రాలయం నియోజకవర్గ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థి, యువజన ఆధ్వర్యంలో జరుగు ఛలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యువజన నాయకులు రఘు రామ్, శివరామిరెడ్డి, నరవ రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురు వారం వారు విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల వద్ద వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, యువనేత ధరణీరెడ్డి, యువతీ యువకుల నేతృత్వంలో ఛలో ఆదోని మెడికల్ కాలేజీ అనే నినాదంతో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హులికన్వి గ్రామ సర్పంచ్ చిన్న మహాదేవ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన సిల్వర్ జూబ్లీ కళాశాల

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: క్లస్టర్ యూనివర్సిటీ, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులను ఉద్దేశిస్తూ దీక్షరాంబం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడినది. కళాశాల అధ్యక్షులు, క్లస్టర్ యూనివర్సిటీ ఇంచార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్ అధ్యక్షత వహించి కళాశాల ఘనతను గురించి చాటిచెప్పారు. జాతీయ స్థాయిలోని ఎన్‌ఐఆర్ఎఫ్ ర్యాంకుల కోసం మొత్తం 5 వేల కళాశాలలు పాల్గొనగా, అందులో మన సిల్వర్ జూబ్లీ కళాశాల 200 నుంచి 300 మధ్య ర్యాంకులో రావడం ఎంతో హర్షదాయకము అని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ విధంగా రావడం ఇది నాలుగవసారి అని, కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాడేట్స్ జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటారు. ఈనెల 2వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన తల సైనిక్ క్యాంపులో కళాశాల విద్యార్థి టీ కార్తీక్, సిల్వర్ మెడల్‌ను, కె.హిమబిందు, డి.మనిషా, విద్యార్థినిలు స్వర్ణ పథకాన్ని సాధించి కళాశాల ఘనతను జాతీయస్థాయిలో చాటారని తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం

**విశాలాంధ్ర - ఆదోని రూరల్:** ఉపాధ్యాయులు సమాజ అభివృద్ధికి, విద్యాభివృద్ధికి, మానవీయ విలువల పెంపుదలకు చేసిన కృషి ప్రశంసనీయమని ఇదే విధానాన్ని కొనసాగించి ఉత్తమ సమాజ స్థాపనలో కీలక భూమిక పోషించాలని ఎస్టీయూ పట్టణ శాఖ అధ్యక్షులు రవి అన్నారు. బుధవారం ఎస్టీయూ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన గ్రహీతలకు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానం చేసి మెమెంటోలు బహుకరించారు .కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్, ఉరుకుందప్ప, గిరి బాబు, సుధాకర్ బాబు మాట్లాడుతూ అవార్డులు మరింతా బాధ్యతను పెంచాయని, పాఠశాలలలో విద్యార్థుల నమోదుకు వివిధ కార్యక్రమాల ద్వారా పెంపునకు కృషిచేసి విద్యావ్యవస్థను పటిష్టపరచి పరిరక్షించుకోవలసిన బాధ్యతను స్వీకరించాలని సూచించారు.ఎస్టియు రాష్ట్ర నాయకులు వీరచంద్రయాదవ్ మాట్లాడుతూ అన్ని వృత్తులలోకెల్లా పవిత్రమైన వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులు ఎంతో ధన్యులని, వెలుగుతున్న దీపం మరొక దీపాన్ని వెలిగిస్తుందన్న సూక్తిని నిజం చేస్తూ ఉపాధ్యాయులందరూ ఎల్లప్పుడు నూతన జ్ఞానంతో విద్యార్థులకు బోధన చేయాలన్నారు.రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించటం అభినందనీయమని, రాష్ట్ర విద్యాభివృద్ధిలో కీలద పాత్ర పోసిస్తున్న ఉపాధ్యాయులకు ఎటువంటి త్వరిత ఇబ్బందులు లేకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 12వ పిఆర్సి కమిషనర్ ను నియమించి 30 శాతం మధ్య భృతిని ప్రకటించి వివిధ ఆర్థిక బకాయిల చెల్లింపునకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్టియు పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి భీమరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, ఎస్టియు నాయకులు జంబులయ్య, ప్రహ్లాద, ప్రసాద్, విజయ్, జయరాముడు, వెంకట్రామిరెడ్డి, శ్రీరాములు, సుభాన్, నిరంజన్ రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

## మహిళలపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

**విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ :** మండల పరిధిలోని కరివేన అగ్రహారం భూములపై ఓ వ్యక్తి కన్ను పడిందని, ఈ భూ ఆస్తులు తరతరాలుగా తమ కుటుంబీకులకే ఉన్నాయని, ఆ గ్రామానికి చెందిన రైతులు బివి మురళీకృష్ణ శర్మ, బివి చక్రవర్తులు అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్ బీ అతిథి గృహం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కరివేన గ్రామంలోని తమ భూములపై ఓ వ్యక్తి దౌర్జన్యంగా తమ భూములను ఆక్రమణ చేసు కొనేందుకు తమపై దాడులకు తెగబడుతున్నారని, అదే గ్రామానికి చెందిన మహిళ రైతులు బర్నాల కృష్ణమ్మ, గీతమ్మ, మాధవరం వినోద్ కుమార్, సిహెచ్ మధు, కురుపాటి నారాయణ, రాజు తెలిపారు. తమ భూములను ఆక్రమించుకునేందుకు మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తూ అక్రమ కేసులు బనాయించే విధంగా ప్రవర్తిస్తున్నారని, ఆ వ్యక్తి తీరుపై ఆ గ్రామానికి చెందిన మహిళ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 16న ఆ వ్యక్తి బాధితులపై మహిళలని చూడకుండా దురుసుగా ప్రవర్తించి దౌర్జన్యంగా వారికి సంబంధించిన 93 సెంట్లు స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు వారు ఏర్పాటు చేసుకున్న సిమెంటు పోళ్లను తొలగించి, దౌర్జన్యంగా కంచెను ఏర్పాటు చేసుకున్నారని, బాధిత మహిళ రైతులు అక్కడికి వెళ్లి ఎలా కంచె వేస్తావని, మహిళలు గ్రామస్తులు అడ్డుకునే ప్రయత్నం చేయడం జరిగిందని తెలిపారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆకుల సలాం బాషపై తప్పుడు ఆరోపణలు చేసి తనకు ఇష్టం వచ్చిన రీతిలో సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ బెదిరింపులకు గురి చేస్తున్నాడని, తన స్థలానికి సంబంధించిన సర్వే నంబర్లు వేరువేరుగా ఉన్నప్పటికీ ఆ వ్యక్తి దౌర్జన్యంగా ఆకుల సలాం బాషపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని బాధితులు బర్నాల కృష్ణమ్మ, గీతమ్మ మాధవరం వినోద్ కుమార్, సిహెచ్ మధు, కురుపాటి నారాయణ రాజులు మీడియా ముందు వారి బాధను వ్యక్తం చేశారు. మహిళలని చూడకుండా దౌర్జన్యం చేస్తున్న ఆ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి మాకు న్యాయం చేయగలరని మీడియా ముఖంగా వారి బాధను వ్యక్త పరిచారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**విశాలాంధ్ర - బనగానపల్లె:** ఆడపిల్లలు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి అన్నారు. అవుకు మండలంలోని చనుగొండ్ల గ్రామానికి చెందిన దూదేకుల రంగప్ప, బాల హుస్సేన్ బి దంపతుల రెండవ కుమార్తె రిజ్వాన గ్రాప్లింగ్ లోని జీఐ, నోగి రెండు రకాల ఆటల్లో 37, 40 కిలోల విభాగాల్లో ఆడి రాష్ట్ర జాతీయ స్థాయిలో పలు పథకాలు సాధించడమే కాక కరాటే జిమ్నాస్టిక్స్ లోను శిక్షణ పొంది రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చూపింది. గురువారం నాడు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నివాసంలో రిజ్వానాను మంత్రి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి సన్మానించి రూ.15 వేల ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రిజ్వాన తండ్రి రంగప్ప, అవుకు మండలం టీడిపి పార్టీ యువ నాయకుడు ఉగ్రసేనారెడ్డి, పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ:** పట్టణ శివారులలోని కేపీజీ పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. పట్టణ సీఐ యుగంధర్ విద్యార్థులకు సైబర్ క్రైమ్, రోడ్ సేఫ్టీ, మాదకద్రవ్యాలు, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్లు, శక్తి యాప్ మరియు ఇతర సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాలూకా ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు అమీర్ భాష, శక్తి టీం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**విశాలాంధ్ర - అవుకు:** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు జిల్లా స్థాయిలో పథకాలు సాధించి ఉత్తమ ప్రతిభను కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మల్లీశ్వరి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ హై స్కూల్ క్రీడా మైదానంలో వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిబేట్, ఎస్సే రైటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు హాజరైన పాఠశాల విద్యార్థులు మోక్ష సాయి, షహనాజ్, శ్రీవల్లి, హర్షిత, సుమశ్రీ, శివ దీపికలు ఉత్తమ ప్రతిభ కనబరిచారని అన్నారు. ఈ నెల 10న జరిగిన మండల స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని డిబేట్ కాంపిటీషన్లో థర్డ్ ప్రైజు, ఎస్ఏ కాంపిటీషన్లో థర్డ్ ప్రైజ్ సాధించారన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థినిలకు సమగ్ర శిక్ష ఎఎంఓ మాధవి, ఈఎండిపి డిస్టిక్ పిడి సుందర్ రావులు బహుమతులు అందించారు. పథకాలు సాధించేలా విద్యార్థినీలకు శిక్షణ ఇచ్చిన వృత్తి విద్యా ఉపాధ్యాయు రాలు విజయ కుమారుని ప్రత్యేకంగా అభినందించారు.

## దసరా నవరాత్రులకు ఆహ్వాన పత్రిక అందజేత

**విశాలాంధ్ర - బనగానపల్లె:** పట్టణంలోని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నివాసంలో మంత్రి సతీమణి బీసీ ఇందిరా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించి, ఈనెల 22 నుంచి వచ్చేనెల 4 తేదీ వరకు జరిగే కొండపేట అమ్మవారి శాల వాసవి కన్యకా పరమేశ్వరి దసరా శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికను ఆర్యవైశ్య నాయకులు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి సీనయ్య అందజేశారు. అనంతరం మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి కార్యాలయంలో మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని ఘనంగా సన్మానించి ఆహ్వాన పత్రిక ను అందజేశారు. బీసీ కుటుంబాన్ని కుటుంబ సమేతంగా తప్పక హాజరుకావాలని ఆర్యవైశ్య నాయకులు కోరారు. అనంతరం అర్బన్ సీఐ కార్యాలయంలో సీఐ ప్రవీణ్ కుమార్‌ను కలిసి ఆహ్వాన పత్రికను ఆర్యవైశ్యులు అందజేశారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య,ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ గాధంశెట్టి వేణుగోపాల్, నూకల విజయుడు, బచ్చు శరత్, సెక్రటరీ శ్రీరామ వెంకట సుబ్రమణ్యం, సాయిరాం, సాగర్, భరతుడు, జంగం, మదన్, బలరామయ్య ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

**విశాలాంధ్ర - చాగలమర్రి :** పట్టణంలోని అడ్డవాగు సమీపంలో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు స్థలం. కేటాయించాలని టిడిపి చాగలమర్రి పట్టణ అధ్యక్షులు అలం సాగారి మౌలాలి కోరారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవో తారకేశ్వరికి గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక కేరళ ఆసుపత్రి సమీపంలో ఉన్న బయలు స్థలం కేటాయించాలని అక్కడ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. దివంగత భూమానాగిరెడ్డి, శోభానాగిరెడ్డి విగ్రహాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, నాగూర్, జల్సాగౌస్, రాజేష్, జోషఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పసుపుకు గాలికుంట టీకాలు వేయించాలి

**విశాలాంధ్ర - పాములపాడు :** నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంట టీకాలు వేయించాలని వెలుగోడు సహాయక సంచారట పశు వైద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం పాములపాడు, మిట్ట కందాల పశువైద్య కేంద్రాలలో కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రైతులను కోరారు. కోళ్లలో ప్రతి బుధవారం కొక్కెర తెగులు వ్యాధి నివారణ టీకాలు వేయించాలనీ, 75శాతం సబ్సిడీతో అందిస్తున్న గడ్డి జొన్నలను వినియోగించుకుని పశు గ్రాస పెంపకం చేపట్టాలన్నారు. రూ.150లకే అందిస్తున్న 90శాతం పేయ్యదూడలు మాత్రమే పొందేందుకు రైతు సోదరులు ఎస్ ఎస్ ఎస్ ఎద సూదులు వినియోగించుకోవాలనీ తెలిపారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న మినీ గోకులాలు, గడ్డి జొన్నలు మరియు అన్ని రకాల వ్యాధి నివారణ టీకాలు వినియోగించుకుని పాల ఉత్పత్తి పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాములపాడు పశు వైద్య అధికారి డా భాస్కర్, స్థానిక సిబ్బంది స్వాతి, తిరుమలేష్, కవిత, గోపాలమిత్ర మున్వర్ బాష పాల్గొన్నారు.

## చలో మెడికల్ కాలేజ్‌కి అనుమతి లేదు

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** వైసీపీ నేటి శుక్రవారం తలపెట్టిన చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమానికి పోలీసుల అనుమతి లేదని ఆళ్లగడ్డ డి.ఎస్.పి ప్రమోద్ కుమార్ తెలిపారు. గురువారం ఒక ప్రకటన ద్వారా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసీపీ విద్యార్థి యువజన విభాగాలతో కలిసి శుక్రవారం తలపెట్టిన చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమానికి పోలీసుల నుండి ఎలాంటి అనుమతులు లేవన్నారు. నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి, రెండో సంవత్సరం పరీక్షలు జరగనున్నాయని, వైసీపీ చేపట్టిన ఆందోళన కార్యక్రమం వల్ల పరీక్షల నిర్వహణకు అంతరాయం కలిగే అవకాశం ఉందని, విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. నంద్యాల మెడికల్ కళాశాల వద్ద ఏ విధమైన సమావేశాలకు అనుమతులు ఇవ్వలేదని ఆళ్లగడ్డ డిఎస్పి కార్యాలయం ప్రకటనలో తెలిపింది.

## జిల్లా ఫిజియోథెరపీ సంఘానికి జాతీయ స్థాయి ఉత్తమ శాఖ పురస్కారం

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల:** ఢిల్లీలో ఇండియా కాన్స్టిట్యూషన్ క్లబ్ వేదికపై గత ఆదివారం జాతీయ ఫిజియోథెరపీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన మూడవ జాతీయ సదస్సులో నంద్యాల జిల్లా ఫిజియోథెరపిస్ట్‌ల సంఘానికి, ఫిజియోథెరపీపై ప్రజా అవగాహన కార్యక్రమాలు, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు, ఉచిత శిబిరాలు నిర్వహించినందుకు జాతీయస్థాయి ఉత్తమ జిల్లా శాఖ పురస్కారం అందించారని నంద్యాల జిల్లా ఫిజియోథెరపీ సంఘం కోశాధికారి జగదీశ్వర రెడ్డి తెలిపారు. జాతీయస్థాయిలో ఆరు పురస్కారాలు అందించగా, దక్షిణ భారతదేశంలో ఈ పురస్కారానికి ఎంపికైన ఏకైక జిల్లా నంద్యాల జిల్లా అని, ఈ పురస్కారాన్ని ఎంపీ బన్సూరి స్వరాజ్, రాజీవ్ భరద్వాజ్, జాతీయ ఫిజియోథెరపీ సంఘం అధ్యక్షులు డాక్టర్ సంజీవ్ కుమార్ చేతుల మీదుగా నంద్యాల జిల్లా శాఖ తరపున డాక్టర్ కాటసాని శివ బాలిరెడ్డి, డాక్టర్ రోహిణి విజయ్ స్వీకరించారు. సదస్సుకు హాజరైన పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

# ఉయ్యాలవాడలో కుండపోత వర్షం

**విశాలాంధ్ర, ఉయ్యాలవాడ :** నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలంలో గురువారం కుండపోత వర్షం కురిసింది.. దాదాపు మూడు గంటల పాటు కురిసిన వర్షానికి వల్లపు ప్రాంతాలు జలమయ మయ్యాయి. వక్కిలేరు, భవనాసి, కుందు నదులు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి. ఉయ్యాలవాడ మండలంలోని హరివరం గ్రామంలో వీధులన్నీ నదులను తలపించాయి. ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నిరుపేదలకు చెందిన ధాన్యం, బట్టలు వస్తువులు తడిచిపోయాయి. కొన్ని వరద నీటిలో కొట్టుకుపోయాయి. బాధితులు దిక్కుతోచక వీడియో కాల్ ద్వారా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి ఫోన్ చేయగా ఆమె వెంటనే స్పందించి అధికారులు మీ వద్దకు వచ్చి సహాయ కార్యక్రమాలు చేస్తారన్న భరోసా ఇచ్చారు. ఉయ్యాలవాడ పోలీసులు, రెవెన్యూ అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు. ఆళ్లగడ్డ నుంచి మాయలూరు ఆర్ అండ్ బీ ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. ఇంజేడు గ్రామ సమీపంలో కుందర వాగు వంతెనపై వరద నీరు ప్రవహిస్తుంది. ప్రజలు ఉయ్యాలవాడ నుంచి ఆర్.పాంపల్లి మీదుగా రాకపోకలు సాగించారు. ఆర్.పాంపల్లి గ్రామంలో భారీ వర్షం కారణంగా పంట పొలాలు జలమయమయ్యాయి. గ్రామం వద్ద ప్రవహించే కుందువాగు ఉధృతంగా పొంగి ప్రవహిస్తూ పంటలను ముంచెత్తింది. ఫలితంగా వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగి భారీ నష్టం సంభవించింది.

## కబడ్డీ జూనియర్ బాలికలకు కోచింగ్ క్యాంప్ ప్రారంభం

**విశాలాంధ్ర - పాణ్యం:** ఆంధ్ర కబడి అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో 51 బాల బాలికల కబడ్డీ పోటీలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి లో జరుగు 26 జిల్లాల రాష్ట్రస్థాయిలో భాగంగా నంద్యాల జిల్లా బాలికల, బాలుర ఎంపిక పోటీలను ఈనెల 14వ తేదీ నంద్యాల ఇండోర్ స్టేడియం నందు 20 మంది బాలికలను 20 మంది బాలురులను ఎంపిక చేయడం జరిగినది. కానీ బాలురు, బాలికల జట్టు 14 మంది మాత్రమే ఎంపిక చేయాలి కనుక కోచింగ్ క్యాంపు గురువారం బాలికలకు పాణ్యం మండలంలోని విజయానికేతన్ పబ్లిక్ స్కూల్ పాఠశాల యందు, బాలుర విభాగంలో జిల్లా పరిషత్ హై స్కూల్ గడివేముల మండలం గడ్డివేముల హైస్కూల్ యందు శిక్షణ శిబిరం ప్రారంభించడం జరిగినది. అందులో భాగంగా ఈరోజు పాణ్యం లో విజయానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల యందు పాఠశాల కరస్పాండెంట్ విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యతోపాటు, క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి మీరు భవిష్యత్తులో మంచి ఉన్నత చదువులు చదువుకొని, ఉద్యోగం సంపాదించుకోవాలని తెలియజేసి ఉన్నారు. క్రీడాకారులకు ఈరోజు నుంచి 22వ తేదీ వరకు ఉచిత వసతి భోజన వసతులు కల్పించిన కరస్పాండెంట్‌కి బాలికల కబడ్డీ క్రీడాకారులు సత్కారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాణ్యం మండల విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం క్రీడాకారులకు ఉన్నత చదువులు చదువుకోవడం కోసం, ఉద్యోగం సంపాదించుట కొరకు 3శాతం స్పోర్ట్స్ కోట రిజర్వేషన్ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఎమ్మెల్యే బీవీ కృషితోనే రైతులకు సాగునీరు : టీడీపీ

**విశాలాంధ్ర - నందవరం:** హాలహర్వి పరిధిలో ఉన్న దేశాయి చెరువుకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి కృషితోనే రైతులకు సాగునీరు అందుతుందని టిడిపి సీనియర్ నాయకులు రైస్ మిల్ నారాయణరెడ్డి అన్నారు. గ్రామంలో దేశాయి చెరువును టిడిపి మండల నాయకులు రైస్ మిల్ నారాయణరెడ్డి, చిన్న కొత్తిలి డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ ఎస్.గోవర్ధన్ రెడ్డి, టీడీపీ మండల కార్యదర్శి ప్రభుదాస్, ఎల్ఎల్‌సి ఎఈ, డిఈ, టిడిపి గ్రామ అధ్యక్షులు ఎర్రన్న, టిడిపి నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రైస్ మిల్ వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే చిన్నకొత్తిలి డిస్ట్రిబ్యూటర్ కాలువ నుండి దేశాయి చెరువు వరకు కాలువ పూడికతీత,పటిష్టత కొరకు గ్రావెల్ రూ. 6లక్షల 75 వేలు మరియు చెరువు తూము నిర్మాణం కొరకు రూ.6 లక్షల 90 వేలు నిధులు మంజూరయ్యాయని, పనులు కూడా పూర్తయ్యాయన్నారు. దేశాయి చెరువుకు నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే బీవీకి ఎల్లవ్పుడూ రుణపడి ఉంటామని, ఎమ్మెల్యే బివి సహకారంతో సాగునీరు అందించామని, సాగునీరు అందించడంతోనే రైతులు వరి పంటలు వేసుకున్నారన్నారు. అన్నదాత సుఖీభవ కింద సీఎం చంద్రబాబు ప్రతి ఒక్క రైతుకు 7 డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రైతులకు యూరియా సమస్య రాకుండా కూటమికి ప్రభుత్వం యూరియాను అందించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోయ నాగరా

## సమస్యలను పరిష్కరించాలంటూ వీఆర్ఏల ధర్నా

**విశాలాంధ్ర - రుద్రవరం:** తమ సమస్యలను తక్షణమే సమస్యలను పరిష్కరించాలంటూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో గురువారం వీఆర్ఏలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు దేవదానం, ఉపాధ్యక్షులు హుస్సేన్ బాష, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి సుధాకర్‌లు మాట్లాడుతూ ఎంతోకాలంగా ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా 16 నెలలు గడిచిన తమ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వీఆర్ఏలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదన్నారు. తమకు పేస్కేలును అమలు చేసి నామిని వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వీఆర్ఏల జీతాలను రూ.21 వేలు పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 19న తాసిల్దార్ కార్యాలయం 20న ఆర్డీవో కార్యాలయం దగ్గర 22న కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. వీఆర్ఏలు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని సమస్యల పరిష్కారం కోసం ధర్నాలను జయప్రదం చేయాలన్నారు. అనంతరం వీఆర్ఏలు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

## విద్యుత్ శాఖపై ప్రజల్లో సంతృప్త స్థాయిని పెంచండి

**విశాలాంధ్ర- బళ్లారి చౌరస్తా :** నగర శివారు ప్రాంతంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యుత్ శాఖ అన్ని స్థాయి ఉద్యోగులకు ఏపీ ఎస్పీడీసీఎల్ కర్నూల్ సర్కిల్ ఎస్ఈ ఉమాపతి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము ప్రతినెల ప్రతిష్టా త్మకంగా చేపడుతున్న సానుకూల ప్రజాభి ప్రాయం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఏపీ ఎస్పీడీసీఎల్ సిఎండి కె.సంతోష్ రావు, డైరెక్టర్ టెక్నికల్ ఏపీ ఎస్పీడీసీఎల్ కె గురువయ్య హాజరై ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులతో చేపట్టే అంశాలలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందుతుందా, సరైన ఓల్టేజ్ తో విద్యుత్ అందు తుందా, విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉన్నారా ఈ విషయాలపై సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ఇంజనీర్లు, లైనింగ్ ఇన్స్పెక్టర్లు, ఉద్యోగులు, మీటర్ రీడర్లు కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

## రిడ్జ్ పాఠశాలలో ఘనంగా దసరా ఉత్సవం

**విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్:** స్థానిక లక్ష్మీ పురం సమీపంలోని రిడ్జ్ పాఠశాలలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని దసరా ఉత్సాహం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణ పూలతో, రంగురంగుల అలంకరణలతో కళకళలాడగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. సీఈఓ గోపీనాథ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పండుగలు మనకు సాంప్రదాయాలను గుర్తుచేస్తాయి. ఈ పండుగ ద్వారా ధైర్యం, నిజాయితీ, క్రమ శిక్షణ వంటి విలువలను తమ జీవితంలో ఆచరణలో పెట్టుకోవాలని సూచించారు. విద్యార్థులు పాటలు, నృత్యాలు, రూపకాలు ప్రదర్శించి ఉత్సవం ప్రత్యేకతను ప్రతిబింబించారు. చిన్నారులు దుర్గామాత స్తోత్రాలు ఆలపించి అందరి ప్రశంసలు పొందారు. ప్రత్యేకంగా అలంకరించిన బొమ్మల కొలువు అందరి దృష్టిని ఆకర్షించింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి కొలువును సందర్శించి దసరా పండుగ సాంప్రదాయాన్ని అనుభవించారు. ఈ దసరా ఉత్సవంలో కో-సీఈఓ సౌమ్య గోపీనాథ్, డీన్ రాజేంద్రన్ ప్రిన్సిపల్ రాజ్ కమల్ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాలలో పండుగ వాతావరణాన్ని సృష్టించారు.

## నగరపాలకలో స్తన్యపాన గది ఏర్పాటుకు చర్యలు

**విశాలాంధ్ర - కర్నూలు సిటీ:** కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చే మహిళలు తమ శిశువులకు పాలు పట్టించుకునే సౌకర్యం లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం నగరపాలక సంస్థ దృష్టికి రావడంతో, ప్రత్యేకంగా స్తన్యపాన గది ఏర్పాటుకు కమిషనర్ పి.విశ్వనాథ్ చర్యలు చేపట్టారు. గురువారం ఆయన స్వయంగా గదిని పరిశీలించి, అవసరమైన పనులను తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తల్లి పాలే శిశువుకు ప్రథమ ఔషధమని, శిశువు ఆరోగ్యానికి, మానసిక వికాసానికి తల్లి పాలకన్నా మించినది లేదన్నారు. అయితే, వివిధ పనుల కోసం నగరపాలక కార్యాలయానికి వచ్చే తల్లులు తమ శిశువులకు పాలు పట్టించుకునే సౌకర్యవంతమైన గది లేకపోవడంతో, వారు పబ్లిక్ ప్రదేశాల్లో ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని తన దృష్టికి వచ్చిందని, వెంటనే ప్రత్యేక గది ఏర్పాటుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. గదిలో తల్లులకు కావలసిన అన్ని సదుపాయాలు కల్పించనున్నామని, కటన్లు, స్ప్రింగ్ డోర్లు, సౌకర్యవంతమైన ఫర్నిచర్, ఫ్యాన్, సరిపడా వెలుతురు (లైటింగ్) వంటి సౌకర్యాలతో పాటు, తల్లులు ఇబ్బందిపడకుండా పూర్తిగా సురక్షితమైన వాతావరణం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, డిఇఈ. గిరిరాజ్, ఏఈ కాశీంవలి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ నాయకులపై పిడుగుద్దులు

**విశాలాంధ్ర ఆదోని రూరల్:** మెడికల్ కళాశాలను ప్రైవేటు పురం కానివ్వమని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున శాంతి యూతంగా నాయకులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థుల సంఘవిద్రోహశక్తులన్న మాదిరిగా పోలీసులు అత్యోత్సహం చూపి అధికార పార్టీకి కొమ్ముఖస్తున్నారని విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలచే పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో డిమాండ్స్ వినిపించే హక్కు విద్యార్థులకు లేదా ఘాటుగా విమర్శలు తలెత్తుతున్నాయి.ధర్నా నుండి వైదొలక్కపోతే కేసులు నమోదు చేస్తామని విద్యార్థిని లను సైతం ఫోటోలు తీస్తూ పోలీసులు భయభ్రాంతులకు గురి చేశారు. ఈ ఘటన గురువారం ఆదోని మండలం ఆరెకల్ మెడికల్ కళాశాల వద్ద చోటు చేసుకుంది. శాంతియుతంగా రోడ్డుపై రాస్తారో చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకుల వద్దకు పోలీసులు ముకుమ్మడిగా చేరుకుని ఉగ్రవాదులు అన్న మాదిరిగా పోలీసుల వైఖరి చాటుకున్నారు. ఇస్వి ఎస్ఐ డాక్టర్ నాయక్ అత్యోత్సహం కనబరచు విద్యార్థులపై లాఠీలతో కొట్టుతూ ఈడుచుకెళ్ళారు. ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడారు.ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులను కాళ్లతో తన్ని పిడుగులు గుద్ది రోడ్డుపై ఈడ్చుకు వెళ్లారు.అక్కడే ఉన్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయి ఎదపై పిడుగులు గుద్దారు.విద్యార్థుల పట్ల నిరంకుశంగా వ్యవహరించిన ఇస్వీ ఎస్ఐ డాక్టర్ నాయక్ తీరును పలువురు ఖండించారు.